# అసలు రహస్యం

## సి. ఆనందారామం

చేతిగడియారం చూసుకుని, హడా విడిగా చెప్పులు తొడుక్కున్నాడు చక్రపాణి. ఆఫీస్ టైమయిపోయింది. త్వరగావెళ్ళి వాడేవడో ఆ 'ప్రజా మిత్రుణ్ని' కలుసుకుని, అసలు రహస్యం బయటపెట్టొద్దని బతిమాలు కోవాలి - ఆఫీస్‌కి జనం రాకముందే, అతణ్ణి పట్టుకోవాలి. బస్‌లో బయలు దేరితే ఆలస్యం కావచ్చు. అంచేత జేబులో డబ్బులు తక్కువగా ఉన్నా, ఆటోలో బయలుదేరాడు. అంతగా అవ సరమయితే, నెలాఖరులో ఎవరిదగ్గరేనా అప్పు చేసుకోవచ్చు. దడదడలాడు తున్న గుండెలతో ఆటో దిగిన చక్ర పాణి నిర్ఘాంతపోయి నిలబడ్డాడు. మూసివున్న ఆఫీస్ తలుపుల ముందు, అప్పటికే యాభైమంది దాకా ఉన్నారు. ఇంకా చేరుకుంటున్నారు.

'మీరేం భయపడకండి. మీబోటి వాళ్ళు బహుశః చాలామందే ఉంటారు.' 'ప్రజామిత్రుడి' మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి. విషయం అర్థ మయింది. సంతృప్తిగా నిట్టూర్చి ఇంటికి మళ్ళాడు. తనను చూసి మిగిలినవాళ్ళు కూడా ఎవరి మట్టుకు వాళ్ళు నవ్వు కుంటూ, తమ తమ గమ్యాలకు మళ్ళటం గమనించాడు, అతనూ నవ్వేసాడు. అసలు రహస్యం ఏమిటంటే......

*  *  *

దేశంలో కంప్యూటర్ సైన్స్ ఇంప్రూవ్ చెయ్యాలని, ప్రత్యేకించి కంప్యూటర్ సైన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీలు ప్రారంభించారు కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో. ఆంధ్ర రాజ ధానిలో కూడా ఒకటి వెలిసింది. ఆ కాలేజీలో ప్రవేశానికి భారీ ఎత్తున యెంట్రెన్స్‌యెగ్జామ్స్ జరుగుతున్నాయి


'మాల్ ప్రాక్టీస్' జరగటానికి ఏ విధమయిన అవకాశము లేకుండా ఎంతో బందోబస్త్ ఏర్పాటు చేసారు. హాలు కున్న మూడు గేట్ల దగ్గిరా ఆరుగురు పోలీసులు తుపాకులు ఎత్తి పట్టుకుని నిలబడి ఉన్నారు. అటూ, ఇటూ, హాలు బయట మరి కొందరు పోలీసులు రాళ్ళ మీద కూచుని రాజకీయాలు చర్చించు కుంటున్నారు. ప్రపంచ తెలుగు మహా సభలకి వచ్చినట్లుగా వచ్చి పడు తున్నారు విద్యార్థులు, పరీక్ష రాయటా నికి. కంప్యూటర్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉంటే నాలుగంకెల జీతంతో, ఉద్యోగం నిశ్చయంగా దొరుకుతుంది. అందుకే, అంత కాంపి టీషన్- అందుకే అంత బందోబస్త్. ఒకరూ, ఇద్దరూ, ఇన్‌విజిలేటర్లు సరి పోరు. అంచేత లెక్కలతో ఏమాత్రం పరిచయంలేని, ఎవరెవరినో, ఇన్‌విజి లేటర్లుగా వేసారు- బారులు తీరి కూచు న్నారు, విద్యార్థులు. ఆ వరసల మధ్య గంభీరంగా అటు ఇటు తల తిప్పుతూ, మనసులో విసుగు నణచుకుంటూ తిరుగు తున్నారు, ఇన్‌విజిలేటర్లు. మొదటి అర గంట గడిచేసరికి వాతావరణం ప్రశాంతమయింది. విద్యార్థులు తల దించుకు రాసుకుపోతున్నారు. ఇన్‌విజి లేటర్స్ తిరగటం ఆపి, అక్కడా, ఇక్కడా కుర్చీలలో కూచుంటున్నారు. గేటు దగ్గిరి పోలీసులు తుపాకులు కిందకి దింపి, స్టూల్స్ మీద కూచున్నారు. అప్పుడు ప్రారంభమయింది చక్రి పాణిలో ఆందోళన: ఇంత మందిలో శ్రీ శ్రీనివాస వెంకట్రావు ఎవరో ఎలా తెలుసుకోవటం? ఆ వ్యక్తిని అతడెన్నడూ చూడలేదు. అతడి స్నేహితుడు సుబ్బారావు ఉత్తరం రాసాడు నెల్లూరి నుంచి...

"డియర్ పాణీ:

ఎలా ఉన్నావురా? నా ఉత్తరాలకి సమాధానాలు వ్రాయకుండా, ఏ వ్యవ హారాలు వెలగబెడుతున్నావురా? ఒరేయ్: మన చిన్నతనపు రోజులు గుర్తున్నాయా? వీధి మీది బడ్డీ దుకా ణాల్లో అప్పులు చేసి, పచ్చిమిరపకాయ బజ్జీలు కొనుక్కు తినేవాళ్ళం: నాన్నారి జేబుకి కత్తెరేసి, ఆ అప్పులు తీర్చేసే వాళ్ళం: ఆ బంగారు రోజులు మళ్ళీ రావురా! అప్పులు చెయ్యటమే కాని, తీర్చే మార్గాలు, తెలిసిచావటం లేదు- ఈ గొడవలకేం గాని, ఒక ముఖ్యమైన విషయంరా: మావాడొకడు కంప్యూ టర్ సైన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుకి యెంట్రన్స్‌కి కూచుంటున్నాడు. అక్కడికి నిన్ను ఇన్‌విజిలేటర్‌గా వేసారని తెలిసింది. కాస్త మా వాడికి సాయంచెయ్యి - మన చిన్నతనపు స్నేహం గుర్తుచేసుకుని, ఈ చిన్న సాయం చెయ్యరా, బాబు: వాడు నీ మేలు మరిచిపోడు - ఉంటాన్రా: ఈసారి హైద్రాబాద్ వచ్చినప్పుడు కలుస్తా: వాడి పేరు శ్రీ శ్రీనివాస వెంకట్రావు.

సుబ్బావ్......"

ఉత్తరం మరోసారి చదువుకున్నాడు. ఆ ఉత్తరంలో వెంకట్రావుని గుర్తు పట్టే మార్గాలేవీ లేవు. చివరికి రిజి



స్ట్రేషన్ నంబర్ కూడా లేదు. పరీక్ష హాల్లో శ్రీ శ్రీనివాస వెంకట్రావ్ ఎవరో లేచి నిలబడండి అని అరవటం ఎలా కుదురుతుంది? ఇంతకీ సాయం చెయ్యాలన్నా అతడికి ఆ సబ్జెక్టు ఏం తెలియదు. క్వశ్చన్ పేపర్ చూసాడు. అంతా అబ్జెక్టివ్ టైప్. కళ్ళు మూసుకుని టిక్స్ పెట్టెయ్యొచ్చు, కానీ, మార్కులు రాకపోగా, మైనస్ మార్కులు వచ్చే ప్రమాదముంది. ఒక ఆలోచన వచ్చింది. కాలేజి యాజమాన్యంవారు, ఇన్విజిలేటర్స్‌కి కాఫీ ఫలహారాల ఏర్పాట్లు ఏమీ చెయ్యలేదు. కాలేజి స్టాఫ్ కూడా అక్కడ ఇద్దరు ముగ్గురున్నారు. నెమ్మదిగా కాస్త మెతకగా కనిపించే లెక్చరర్ దగ్గిర చేరాడు- "గురుగారూ! కాస్త కాఫీ తెప్పించుకుందామా?" అన్నాడు. ఆ లెక్చరర్ జేబులు తడుముకుంటూ, "ఎందుకులెండి!" అన్నాడు.

"ఫర్వాలేదండీ! నరసింహం! ఇలారా! ఈ పదీ పట్టికెళ్ళి, రెండుదోసె, రెండు వడ, రెండు కాఫీ తీసుకురా!" అని అక్కడి ప్యూన్ చేతిలో పది రూపాయల కాగితం పెట్టాడు- తర్వాత ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

సినిమాల గురించీ సినిమాతారల మీది స్కాండల్స్ గురించీ సీరియస్‌గా చర్చించుకున్నారు. అక్కడితో వాళ్ళ మధ్య తాత్కాలిక స్నేహం అల్లుకుంది. కాఫీ ఫలహారాలొచ్చాయి. ఆన్టీరూంలో పెట్టాడు నరసింహులు. ఇద్దరూ ఫలహారాలు చేస్తుండగా, మళ్ళీ సంభాషణ మొదలుపెట్టాడు చక్రపాణి. "మీ క్వశ్చన్ పేపర్ అంతా ఆబ్జెక్టివ్ టైప్-"

"అవును- చాలా కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో, పేపర్ ఇలాగే ఉంటుంది. కొన్నింట్లో థియరీ కూడా ఉండి యెస్సే క్వశ్చన్స్ ఉంటాయి."

"ఈ పేపర్ మా బోటివాళ్ళు కూడా ఆన్సర్ చేయొచ్చు - చెయ్యనా?"

లెక్చరర్ సరదాగానవ్వి "చెయ్యండి" అన్నాడు.

చక్రపాణి ఇష్టంవచ్చినట్లు టిక్స్ పెట్టి "ఈ పేపర్ వేల్యూ చెయ్యండి-" అని లెక్చరర్‌కి ఇచ్చాడు. లెక్చరర్ "తప్పు" అన్నప్పుడల్లా, "మరి రైటేదీ?" అని అడిగి తెలుసుకుని, చిన్నపిల్లాడిలా అరిచేతిలో నోట్ చేసుకున్నాడు. అంతా అయ్యాక, లెక్చరర్

పేపర్ చింపెయ్యబోయాడు, "వొద్దు ఉండనీయండి - సరదాగా చూసుకుంటాను." అని మడతపెట్టి జేబులో పెట్టుకున్నాడు.

"మీకు 28 శాతం మార్కులే వచ్చాయి. ఓరల్ యెగ్జామ్‌కి వచ్చే అర్హతలేదు" నవ్వుతూ అన్నాడు లెక్చరర్. అతడిదంతా సరదగా అనుకున్నాడు.

"పోనీయండి-రాతలేదు" నవ్వుతూ ఏడుపుముఖంపెట్టి, నుదుటి మీద వేలితో వ్రాసుకున్నాడు చక్రపాణి. ఇద్దరూ నవ్వుకుంటూ హాల్లోకి వచ్చారు, కాఫీ ఫలహారాలు ముగించి. సరియైన సమాధానా లొచ్చాయి, ఇక విద్యార్థి ఎవరో తెలియాలి. దానికీ ఒక ఆలోచన వచ్చింది. ఒక్కొక్కరిదీ హాల్ టికెట్ తీసి చూడసాగాడు పేరుకోసం. ఎంత మందివని చూడడం? ఈలోగా పుణ్యకాలం కాస్తా అయిపోతుంది. ఒక హాల్ టికట్ మీద యస్.యస్.వి.రావు అనే పేరుంది. అక్కడ ఆగి అతి నెమ్మదిగా "నీ పేరు శ్రీ శ్రీనివాస వెంకట్రావా" అని అడిగాడు. అతడు వెంటనే అంతకంటే నెమ్మదిగా "అవును సార్! మిమ్మల్నెలా మాట్లాడించాలో తెలీక అవస్థపడుతున్నాను" అన్నాడు.

"నువ్వు నన్ను గుర్తుపట్టావా?


"హాల్లోకి వస్తూనే గుర్తుపట్టాన్సార్!"

"ఇంతకు ముందు మనం ఎప్పుడూ కలుసుకోలేదుగా!"

"మా మావయ్య మీ గురించి విపులంగా రాసాడు పాణిగారూ!"

ఆ సంభోంధనతో ఉలికిపడ్డాడు చక్రపాణి. అతడింకా చెప్పుకు పోతున్నాడు, "బుజ్జిపండూ, చిట్టితల్లీ, పెద్దక్క అంతా బాగున్నారు. మిమ్మల్ని తలుస్తుంటారు..."

వాళ్ళు ఎంత నెమ్మదిగా . మాట్లాడు




కుంటున్నా, చుట్టుపక్కల విద్యార్థులు తలలు తిప్పి చూడసాగారు.

"హుష్" అని ముందుకు సాగిపోయాడు చక్రపాణి. అతడి అనుమానం తీరిపోయింది. మరో మూడు వరసలు అటు ఇటు తిరిగి, మళ్ళీ యస్.యస్.వి.రావు దగ్గరకి వచ్చి, చాకచక్యంగా తన దగ్గిర కరెక్ట్ ఆన్సర్స్ ఉన్న పేపర్ అతని ముందుకు తోసి, అతడి దగ్గిర ఉన్న పేపర్ తను అందుకుని, మడిచి జేబులో పెట్టుకున్నాడు. సైంధవుడి శిరసు ఖండించిన అర్జునిడిలా, గొప్పగా అనుభూతి చెందాడు. రెండు గంటలూ అయ్యాక, మరో పది నిమిషాలు సర్ది బయటపడ్డాడు. అతడు ఆశించినట్లే రోడ్డుమీద ఎదురుచూస్తున్నాడు యస్. యస్.వి. రావు. "హలో! పాణిగారూ! నమస్తే! రండి! హోటల్ హర్షాలో టీ తీసుకుంటూ మాట్లాడదాం!" అన్నాడు. హోటల్‌లో కూచున్నాక, బాసుందీకీ, మసాలా దోసెకి ఆర్డరుచేసి "చాలా థ్యాంక్స్ పాణిగారూ! మీ దయవల్ల నేనీ యెంట్రెన్స్‌లో యూనివర్శిటీ ఫస్ట్ రావచ్చు-" అన్నాడు ఉత్సాహంగా!

"దాన్దేముందిలే కానీ, ఇంతకూ నువ్వు సుబ్బారావుకి ఏ రకంగా అల్లుడివి?" అడిగాడు చక్రపాణి.

"సుబ్బారావెవరు?"

బాసుంది తింటోన్న పాణి చేతిలో చెమ్చా జారిపోయింది.

"నీకు సుబ్బారావు తెలీదూ? అయితే, నన్నెలా గుర్తుపట్టావ్?"

"అదేమిటండీ, మీ బ్రీఫ్‌కేస్ మీద మీ పేరులేదూ? పైగా మీరది చేత్తోనే పట్టుకు తిరుగుతున్నారు."

"మైగాడ్! మరి, బుజ్జిపండు, చిట్టి తల్లీ, పెద్దక్క--?"

"వాళ్ళా? వాళ్ళు తెలుగు దేశంలోని ఏ కుటుంబంలో అయినా ఉంటారు!"

ముచ్చెమటలు పట్టాయి చక్రపాణికి.

"నాయనా! నువ్వెవరో నాకు తెలీదు. కానీ, జరిగిందేదో జరిగింది. నోర్మూసుకుని ఉండు."

"నోరు మూసుకోవటం ఎలా అండీ? జరిగింది అందరికీ చెప్పొద్దూ?"

గుండె గుభిల్లుమంది పాణికి.

"నీకిదేం పొయ్యే కాలమయ్యా! నీకు మేలే జరిగిందిగా?"

"నాకు మేలేమిటండీ, నా బొంద! ఉద్యోగం చేసుకుంటున్నవాడికి ఇక్కడ సీటొస్తే ఎంత? రాకపోతే ఎంత?"

"ఉద్యోగమా? ఏం ఉద్యోగం? అసలు నువ్వెవరూ?"

"ఎంత సేపటికడిగారండీ, ఎప్పుడో అడగవలసిన ప్రశ్న. సావధానులై వినండి. నేనొక జర్నలిస్టుని. అసలు పేరు మరిచిపోయాను కలం పేరు "ప్రజామిత్ర". ఇక్కడ జరుగుతున్నది బయటి ప్రపంచానికి చెప్పటం కోసమే, నిష్కారణంగా రెండున్నర గంటలు వేస్ట్ చేసుకున్నాను. నా అదృష్టంకొద్దీ నాకు మీరు జాక్‌పాట్‌లా తగిలారు."

"అయితే ఇదంతా మీ పేపర్లో వేస్తావా?"

"వెయ్యటానికే కదండీ, వొచ్చింది?"

"అన్యాయం"" కళ్ళనీళ్ళు తిరుగుతున్నాయి పాణికి.

"అన్యాయం బయట పెట్టడం అన్యాయం అంటే ఎలా అండీ?"

భోరున ఏడవటం ఒకటే తక్కువ చక్రపాణికి. అతడి ముఖం చూస్తే జాలేసింది జర్నలిస్ట్‌కి. "బాధపడకండి.




మీకేం భయంలేదు. మేం ఎవరి పేర్లు ఇవ్వం. విషయం మాత్రమే వేస్తాం. మీబోటివాళ్ళు బహుశః చాలామందే ఉండే ఉంటారు. అంతా ఎవరి మటుకు వాళ్ళే తమనే అనుకుంటారు."

తర్వాత వచ్చిన మసాలా దోసె తినలేకపోయాడు పాణి. వేస్ట్ అయిందని బాధపడలేదు జర్నలిస్ట్. అతడికి కావలసినది అతడికి దొరికింది.

* * *

మరునాడే పేపర్లో వచ్చింది వార్త.

"చేను మేసే కంచెలు."

ఒకనొక కాంపిటేటివ్ యెంట్రన్స్ యెగ్జామ్ ఇన్విజిలేటర్, విద్యార్థికి కాపీ అందించిన కథ. వివరాలు, రేపటి పత్రికలో......"

చదివి కంగారుపడిపోయి, తన పేరు బయటపెట్టకుండా చూడమని ప్రాధేయపడటానికి ఆ పేపర్ ఆఫీస్‌కి బయలుదేరాడు. అక్కడ తనకంటె కంగారుగా చాలామంది ఉన్నారు. వెంటనే 'మీబోటివాళ్ళు బహుశః చాలామందే ఉండి ఉంటారు' అన్న 'ప్రజామిత్ర' మాటలు గుర్తొచ్చాయి. "ఎందరో మహానుభావులు! ఎందరినని వర్ణించగలడూ?" అనుకుంటూ, ఇంటికి బయల్దేరాడు.

